### ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు

## జిల్లా నుంచి ఎంపికైన వెండుగంపల్లి వాసులు !!



దంపతులు మునిలక్ష్మి,నారాయణ

కుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త

దేశరాజధాని న్యూఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు చిత్తూరు జిల్లా నుంచి రైతు దంపతులు ఎంపికయ్యారు. కుప్పం మండలం వెండుగంపల్లి పం చాయతీకి చెందిన రైతు దంపతులు మునిలక్ష్మి, నారాయణలు పిఎం కిసాన్ పథకంలో లబ్దిదారుల కోటా కింద వీరు ఎంపిక య్యారు. ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాత ంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు గాను వీరికి కేంద్ర ప్రభుత్వమే ఉచిత ప్రయాణ వసతి సమకూర్చింది. వీరు ఆదివారం కుప్పం నుంచి బయలుదేరారు. సోమవా రం విజయవాడనుంచి హజ్రత్ నిజాముద్దీన్ ఎక్స్ప్రెస్‌లో బయలుదేరి ఢిల్లీకి చేరుకుని అక్కడ వేడుకల్లో పాల్గొని మరలా అదే రైలులో ఈనెల 17న విజయవాడ చేరుకుంటారు. వీరి ఎంపిక పట్ల మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ హర్షం


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## నేటి నుండి హర్ ఘర్ తిరంగా

### కార్యక్రమం విజయవంతానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపు

చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:

అజాదీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్ధేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంను సోమవారం నుండి ఆగస్టు 15వ తేదీ వరకు విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జాతీయ జెండాలతో సెల్ఫీలు తీసుకుని హర్‌ఘర్‌తిరంగా.కామ్ పోస్ట్ చేయాలన్నారు. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో దేశభక్తికి సంబంధించిన పాటలు, డ్రామాలు, మోనో యాక్షన్ తదితర కార్యక్రమాల నిర్వహణను జిల్లా విద్యాశాఖ అధికారి, ఆర్‌ఐఓ, డివిఇఓలు నిర్వహించాలన్నారు. మంగళవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంకు స్వయం సహాయక సంఘాల మహిళలో ర్యాలీలను డిఆర్‌డిఎ, మెప్మాల ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. అలాగే బిగ్ రన్ మారథాన్‌ను డిఎస్‌డిఓ, ఆర్‌ఐఓ, డిఇఓలు సమన్వయం చేసుకుని నిర్వహించాలన్నారు. అలాగే అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేయాలని, 14వ తేదీ జిల్లా, మండలం, గ్రామ, వార్డు కార్యదర్శులతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహణను అర్బన్ పరిధిలో మున్సిపల్ కమీషనర్లు, గ్రామ పంచాయతీల పరిధిలో డిపిఓలు పర్యవేక్షించాలన్నారు. డిఇఓ, డిఎస్‌డిఓ, డిపిఆర్‌ఓలు సమన్వయం చేసుకుని నిర్వహించాలన్నారు.

# వైద్యం ఏదైనా ఖరీదే!

### పరీక్షల పేరుతో ఆర్‌ఎంపీలు నిలువు దోపిడీ - ల్యాబ్ సెంటర్‌లలో కమీషన్ దారులు
### మెడికల్ షాపుల్లోను పర్సంటేజీలు - చోద్యం చూస్తున్న వైద్యశాఖ ఉన్నతాధికారులు







ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు వద్ద గుమికూడిన రోగులు, ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన మందులు, వాడి పడేసిన సిరంజ్‌లు

గంగవరం, ఆగస్టు 11, ప్రభాతవార్త :

పలమనేరు నియోజకవర్గంలోని పలమనేరు పట్టణం,గంగవరం,పెద్దపంజాణి,బైరెడ్డిపల్లె,వికోట మండలాలోని ప్రజానీకానికి ప్రభుత్వం వైద్యం నేటికీ అందని ద్రాక్ష లాగే మిగిలింది.ప్రజా ఆరోగ్యం కోసం ప్రభుత్వం వేల కోట్లు రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు నివేదికలు చెప్తున్నా అది ఏ మాత్రం క్షేత్ర స్థాయిలో ప్రజల చెంతకు చేరడం లేదనేది సుస్పష్టం.గ్రామీణప్రజల అవసరాలను అవకాశంగా తీసుకున్న కొందరు గ్రామీణ వైద్యులు ఎటువంటి విద్యా అర్హతలు లేకున్నా,వైద్య విద్య చదవకపోయినా కేవలం కొద్ది రోజులు పట్టణ ప్రాంతాలలోని వైద్యశాలలో కంపౌండర్‌గానో లేక ఏ విధంగానైనా పనిచేసి సూది వేయడం,సెలయిన్ పెట్టడం నేర్చుకుంటేచాలు ఇక డాక్టర్ అయినట్లే..గ్రామీణ వైద్యులుగా అవతారం ఎత్తి పల్లె,పట్టణాలు అనే తేడా లేకుండా ఆవాసాలు ఏర్పర్చుకుని ప్రజలకు వైద్య పరీక్షలు అందిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. తమ వద్దకు వచ్చే రోగులకు మోతాదుకు మించి మందులు రాయిస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు.వీరు చేసే వచ్చీరాని వైద్యం వలన రోగం ఒకటైతే మందు మరొకటి వెయ్యడంతో వారి పరిస్థితి ప్రాణ సంకటంగా మారిన క్రమంలో ఇదేంటని అడిగితే పత్తాలేకుండా పోతున్నారు.మరికొందరు పలు కారణాలు చెప్పి తమకు నాయకుల అండదండలు ఉన్నాయంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు.ఇటీవల మండలంలో 'ఆర్‌ఎంపీ డాక్టర్ వైద్యం.. అనంతలోకాలకు పయనం..! భర్త ఆదేశాలతో..ఇంజక్షన్ వేసిన భార్య..గాలిలోకి కలిసిన ప్రాణం మండలంలో ఆలస్యంగా వెలుగు చూసిన వైనం' అనే శీర్షికతో వార్త దినపత్రికలో ప్రచురితమైన విషయం పాఠకులకు విధితమే. మండలంలోని నాలుగు రోడ్లలోని పారిశ్రామికవాడలో కొందరు నకిలీ వైద్యులు ఆర్‌ఎంపీ వైద్యుల అవతారమెత్తారు.ఆర్‌ఎంపీ వైద్యులు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని ఏదైనా అత్యవసర పరిస్థితిలో సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సిఫార్సు చేయాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి.అయితే కొందరు ఆర్‌ఎంపీలు నిబంధనలు అతిక్రమిస్తున్నారు.వారి వద్ద ఉన్న మందులను చూస్తే ఓ ఫార్మసిని తలపిస్తున్నాయి.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ జ్వరం ఏదైనా ఖరీదైన వైద్యం చేస్తున్నారు.ఇక పలమనేరు పట్టణంలో అయితే ఆర్‌ఎంపీలు రోజు రోజుకు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నారు. జ్వరం వచ్చిందని వారి వద్దకు వెళ్ళితే ఇక అంతే సంగతులు డెంగీ, మలేరియా, డయోరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్స్ వంటి ప్రాణాంతకమైన వ్యాధులైనా సరే వీరు చికిత్సలు నిర్వహిస్తారు. తరువాత రోగి ఆరోగ్యం కుదుటపడని క్రమంలో అక్కడే వారి అద్దె భవనాల్లో ఏర్పాటు చేసుకున్న 5,10,పడకల ఆసుపత్రిలో చేర్చుకుని వివిధ రకాల టెస్టుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు.రెండు మూడు రోజులకు పైగా రోగులను దోచుకుని తరువాత ప్రభుత్వ వైద్యులు,ల్యాబ్ నిర్వాహకులు ముందుగా కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా ప్రభుత్వ వైద్యులు నిర్వహిస్తున్న ప్రైవేటు వైద్యశాలలకు తరలిస్తూ..కమీషన్ వ్యాపారం చేస్తూ రెండు వైపులా సంపాదిస్తున్నారు.కొందరు ఆర్‌ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా గర్భస్రావాలు చేస్తూ భ్రూణహత్యలకు సైతం పాల్పడుతున్నారు. ఔషధ దుకాణాలతో 15 శాతం నుంచి 20 శాతం వరకు కమీషన్లు పెట్టుకోవడంతో పాటు వైద్యుల క్లీనిక్,ఇంటి అద్దెలు మందుల దుకాణాల వారే భరిస్తూ ఆ భారాన్ని మందుల రూపంలో రోగుల నుంచి దోచుకుంటూ ఆర్‌ఎంపి అవతారంలో ఉన్న నకిలీ వైద్యులు జేబులు నింపుకుంటున్నారు.రోగులకు అవసరం లేకున్నా కొందరు ఆర్‌ఎంపీలు కమీషన్ల కోసం నిర్ధారణ కేంద్రాలయజమానులతో కుమ్మక్కై నాలుగైదు రకాల నిర్ధారణ పరీక్షలు చేయిస్తూ వీటికి అయ్యే ఖర్చులో సగం తమకు చేరేలా వ్యవహారం నడిపిస్తున్నారు.నాలుగు రోడ్ల కూడలిలో ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు వైద్యంతో పాటు తమ వద్ద షుగర్,కొలెస్ట్రాల్, మూత్రపిండాలు, మలేరియా,లివర్,సిబిసి,టైఫాయిడ్,డెంగ్యూ,హెచ్ఐవి,థైరాయిడ్‌తో పాటు అన్ని రకాల పరీక్షలు నిర్వహించబడును అని పరీక్ష కేంద్రాన్ని నిర్వహించడం గమనార్హం.వివిధ రకాల పరీక్షల పేరుతో రోగుల నుండి సొమ్ములు ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు సమాచారం. వీరి అక్రమాలపై వైద్యాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారు ఆడిందే ఆటగా పాడిందే పాట అన్న చందంగా పరిస్థితి దాపురించింది. ఈ విషయమై ఆదివారం జిల్లా వైద్యాధికారిణి ప్రభావతిదేవిని 'ప్రభాతవార్త' వివరణ కోరగా నిబంధనలు అతిక్రమిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

### ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల

## పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం

**జడ్పీ ఎదుట నేటి ఎస్టీయు మహాధర్నా వాయిదా**
**- ఎస్టీయు ప్రతినిధులతో కలెక్టర్, జడ్పీ ఛైర్మన్, జడ్పీసిఇఓలు సమావేశం**



చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడానికి తాము కట్టుబడి వున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ జడ్పీ పిఎఫ్ సమస్యను సత్వరం పరిష్కరించకుంటే సోమవారం జడ్పీ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తామని ఎస్టీయు నోటీసులు జారీ చేయడంతో ఆదివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎస్టీయు ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి జడ్పీ ఛైర్మన్ గోవిందస్వామి, జడ్పీ సిఇఓ గ్లోరియాలు హాజరయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్టీయు అసోసియేట్ అధ్యక్షులు గంటామోహన్ జిపిఎఫ్ తరహాలో జడ్పీపిఎఫ్‌ను మెరుగుపరచి ప్రక్షాళన చేయాలని కోరారు. జడ్పీ పిఎఫ్ నిర్వహణ లోపం వల్ల పిఎఫ్ స్లిప్పులు అందుబాటులో లేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పిఎఫ్ రుణాలు పొందాలనుకున్నా, పదవి విరమణ పొందేవారు తుది మొత్తాలను పొందాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయన్నారు. అలాగే జిల్లాలో టీచర్లందరికీ సర్వీసు రెగ్యులైజేషన్ జాబితాలు డిఎస్సీల వారీగా, క్యాడర్ల వారీగా విడుదల చేయడంలో జిల్లా విద్యాశాఖ నిర్లక్ష్యం వహిస్తోందని గంటామోహన్ ఆరోపించారు. ఫలితంగా టీచర్ల పదోన్నతులు, బదిలీలు, రేషనలైజేషన్ ప్రక్రియల సందర్భంగా అవకతవకలకు ఆస్కారం ఏర్పడుతున్నదన్నారు. ఎస్టీయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్‌యాదవ్‌లు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారులు పదోన్నతులు వద్దని తిరస్కరించిన టీచర్లకు మానవతా ధృక్పథంతో రివర్షన్ ఉత్తర్వులు ఇవ్వడంలో సైతం నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అలాగే విధి నిర్వహణలో వుండి అకాల మరణం చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల పిల్లలకు కారుణ్య నియమాకాలు కల్పించడంలోను జాప్యం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందిస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అన్ని సమస్యలను పరిష్కరించడానికి తాము చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. జడ్పీపిఎఫ్ ఖాతాల నిర్వహణలో లోపాలు ఏ స్థాయిలో వున్నాయనే విషయంపై కలెక్టర్ రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో ఫోన్ ద్వారా అప్పటికప్పుడు చర్చించారు. సమావేశంలో ఎస్టీయు రాష్ట్ర నాయకులు పురుషోత్తం, దేవరాజులురెడ్డి, చంద్రన్, మంజునాథ్, లింగయ్య, కమలాపతి, నారాయణ, ఢిల్లీబాబు, గుణశేఖర్, సుబ్రమణ్యంపిళ్ళై, కిషోర్‌కుమార్, మధుబాబు, బాలచంద్రారెడ్డి, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గంగమ్మ తల్లికి క్షీరాభిషేకం

### అర్ధసహస్ర కలశాల ఊరేగింపు



రేణిగుంట, ఆగస్టు 11, ప్రభాతవార్త

శ్రీశ్రీశ్రీ గంగమ్మ తల్లి జాతరను పురస్కరించుకొని రేణిగుంట పట్టణంలో ఆదివారం అర్ధ సహస్ర కలశాల (500) ఊరేగింపు వైభవంగా జరిగింది. దాదాపు 500 మంది ముత్తైదువులు, ఆడపడుచులు సంయుక్తంగా స్థానిక గంగమ్మ శూలం నుండి శ్రీ గంగమ్మ తల్లి దేవస్థానం వరకు క్షీర కలశాలతో గుడి ఛైర్మన్ సోలా మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో ఊరేగింపుగా వెళ్లారు. దేవస్థానం చేరుకొని దేవాలయం ప్రదక్షణ అనంతరం అమ్మవారికి 500 కలశాలలో ఉన్న పాలతో క్షీరాభిషేకం చేశారు. దోషాలన్నీ తొలగిపోయి రేణిగుంట ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వారంతా భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ప్రార్ధించారు. సోమవారం నుండి గరిక ఊరేగింపుతో శ్రీ గంగమ్మ తల్లి జాతర ప్రారంభమై బుధవారం అమ్మవారి విశ్వరూప ప్రతిమను జల్దిలో కలపడంతో జాతర ముగుస్తుందని నిర్వాహకుడు, ఛైర్మన్ సోలా మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. ఊరేగింపులో ఆలయ కమిటీ సభ్యులు జ్యోతి నారాయణ, సదాశివరెడ్డి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## టిటిడిలో ఇంజనీర్లకు విజిలెన్స్ నోటీసులు

### -ఎమ్మెల్యే చెంతకు పంచాయతీ
### -ప్రభుత్వ విజిలెన్స్‌నోటీసులపై కలవరపాటు



తిరుమల,ఆగస్ట్ 11ప్రభాతవార్తప్రతినిధి:

ధార్మికసంస్థ టిటిడిలో ఇది వరకు ఎన్నడూ లేనంతగా గత ఐదేళ్ళలో దేవుని నిధులు మళ్ళింపు, ఇంజనీరింగ్ పనులకు భారీగా కేటాయింపులు చేయడం, పనులు చేయకున్నా కమీషన్లు పంచుకోవడం వంటి ఆరోపణలపై ప్రభుత్వ విజిలెన్స్ఎన్‌ఫోర్స్‌మెంట్ నోటీసులతో టిటిడి ఇంజనీర్లు కలవరపడుతున్నారు. చేయని తప్పుకు తామెందుకు బలి పశువులు కావాలని ,తమ విధుల్లో భాగంగానే పై అధికారులు, ధర్మకర్తలమండలి ఆదేశాలు పాటించామని మొరపెట్టారు. ఏకంగా 50మందికిపైగా టిటిడి ఇంజనీర్లకు విజిలెన్స్అధికారులు నోటీసులు జారీచేయడంపై ఆందోళన చెందుతున్నారు. తమ ఉద్యోగాలపై ప్రభావం చూపుతుందేమోనని కలత చెంది ఆదివారం సాయంత్రం ఏకంగా 30మందివరకు ఇంజనీర్లు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కలసి తమ గోడు వెల్లబోశారు. తాము విధి నిర్వహణలో స్వయంగా తప్పిదాలు చేయలేదని, పై అధికారుల ఆదేశాలు, ఉన్నతాధికారి ఈఓ ,పాలకమండలి ఆదేశాలు అమలుచేశామని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో దాదాపు 30సంవత్సరాలుపైగా నిజాయితీతో విదులు నిర్వహిస్తున్నామని, తమ విధుల్లో భాగంగా ఏరోజూ ఇష్టానుసారంగా పనులు చేయలేదని, పైఅధికారుల ఆదేశాల మేరకు పనిచేశామని విన్నవించారు. పై అధికారులు ఆదేశాలు పాటించకుంటే తమకు విధి నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతాయని మొరవిపించారు. ఇప్పుడు తాము చేయని తప్పులకు విజిలెన్స్ నోటీసులు అందుకుని విచారణ ఎదుర్కోవడం తమకు ఇబ్బందేనని, నాలుగైదు ఏళ్ళలో రిటైర్డ్ కావాల్సిన వాళ్ళం, అనారోగ్యాలతో బాధపడుతున్నవాళ్ళం ఏదేని జరగరాని సంఘటనలు జరిగితే బాధ్యులు ఎవరని ఆవేదన చెందుతున్నారు. తామంతా సర్వీస్‌రూల్స్‌కు లోబడి పనిచేశామని, నిధులు వ్యయంలో భారీగా కమీషన్లు పొందడంలో తమ ప్రమేయం ఏమీ ఉండదని టిటిడి ఇంజనీర్లు ఎఇ టి.వీరప్రసాద్, సివిల్, ఎలక్ట్రికల్ విభాగాలకు చెందిన డిసిఇలు, ఇఇలు శివరామకృష్ణ, శ్రీనివాసరావు, సుబ్రమణ్యం, ప్రసాద్, తదితరులు ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యేను కలసి తమ ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై ఉన్నంతలో సానుకూలంగానే చూస్తామని, తప్పుచేసి ఉంటే శిక్ష తప్పదని ఆయన తెలియజేయడం కొసమెరుపు.





## నేషనల్ స్పేస్‌డేకి ఇస్రో సిద్ధం

శ్రీహరికోట (తడ), ఆగస్టు 11 ప్రభాతవార్త

ఈ నెల 23న జరుగుతున్న నేషనల్ స్పేస్ డే ముగింపు ఉత్సవాలకు ఇస్రో సిద్ధమవుతోంది. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన పలుచోట్ల ఈ కార్యక్రమాలు ఇప్పటికే పూర్తి చేశారు. మంగళవారం శ్రీహరికోటలో పెద్దఎత్తున సంబరాలు జరుపుతున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమానికి వస్తుండటంతో రాజకీయంగాను సందడి మొదలైంది. అయితే ఆయన నేరుగా అమరావతి నుంచి శ్రీహరికోటకు హెలికాప్టర్‌లో చేరుకుంటారని తాజా సమాచారం. ప్రస్తుతం ఉన్న భద్రత జాగ్రత్తలు, రోడ్డు మార్గంలో వస్తే అభిమానుల ఇబ్బందులు గుర్తించి పవన్ నేరుగా పాల్గొంటారని తెలిసింది. మంగళవారం ఉదయం ఆయన 9.30 గంటలకు షార్‌కు చేరుకొని మధ్యాహ్నం 4 గంటల దాకా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ముఖ్యంగా అంతరిక్ష పరిశోధన కేంద్రాలను సందర్శిస్తారు. అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రసంగించడం, బహుమతి ప్రదానం చేస్తారు. షార్‌లోని నక్షత్ర అతిథి గృహంలో పవన్ కల్యాణ్ ఉండి కొద్దిసేపు శాస్త్ర వేత్తలతో మాట్లాడతారని తెలిసింది.

## ఆగని మట్టిమాఫియా!



మల్లిగుంట సమీపంలో తెలుగుగంగ కాలువ కట్ట నుంచి మట్టిని తరలిస్తున్న దృశ్యం(ఫైల్‌ఫోటో)

### తొట్టంబేడు మండలంలో తెలుగుగంగ కాలువ కట్టపై నుంచి మట్టి తరలింపు

తొట్టంబేడు, ఆగస్టు 11 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలంలో మట్టిమాఫియా చెలరేగిపోతోంది. ఈనేపథ్యంలో ఇన్నాళ్ళు రోడ్డుపనుల అంటూ ఆరులైన్ల రోడ్డుపనులకోసం గ్రామాల్లోను చెరువుల్లోను మెగా కంపెనీ మట్టిని ఇష్టారాజ్యంగా తరలించేశారు. ఇక కాసారం, గుండేలిగుంట, తాటిపర్తి, మల్లిగుంట, సాంబయ్యపాళెం గ్రామాల్లోనే కాకుండా ఎక్కడ పడితే అక్కడ మట్టిని తరలించి రోడ్డుపనులకు ఉపయోగించారు. ప్రస్తుతం మండలంలోని తాటిపర్తి సమీపంలోని మల్లిగుంట గ్రామానికి వెళ్ళేదారిలో తెలుగుగంగ 7వ బ్రాంచి కాలువ ఉంది. దీంతో గత మూడు రోజుల నుంచి తెలుగుగంగ కాలువ కట్టపై ఉన్న మట్టిని జెసిబిలతో తొలగించి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. దీనిపై పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా గంగ అధికారులు మాత్రం మౌనం వహిస్తున్నారు. గతంలో కూడా కళ్ళిపూడి, తాటిపర్తి గ్రామాల్లో కూడా మెగా కంపెనీ అధికారులు మట్టిని తరలించగా అప్పట్లో గ్రామస్తులు అడ్డుకున్న విషయం విదితమే. అయితే ప్రస్తుతం 7వ బ్రాంచి తెలుగుగంగ కాలువకట్టనుంచి జెసిబిలతో తరలిస్తున్న మట్టిని ఎక్కడకి తరలిస్తున్నారో అర్థం కావడం లేదు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మట్టితరలింపును అడ్డుకోవడంతో ఆపివేశారు. ఇకనైనా మట్టితరలింపును గ్రామాల్లో అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మట్టితరలింపుపై వైఎస్‌ఆర్‌సిపి సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో గ్రావెల్, మట్టి అమ్మివేస్తామని ప్రచారం చేశారని, అయితే ప్రస్తుతం మల్లిగుంట, కల్లిపూడి, కొత్తచెరువుల్లో గ్రావెల్ మరియు తాటిపర్తి మరియు సెవెంత్ బ్రాంచ్ కెనాల్ గట్టులో చుట్టుపక్కల ఉన్న గుటలు మొత్తం తరలించేసి ఫ్యాక్టరీలకు అమ్ముకుంటున్నారన్నారు. గత నెలరోజులుగా మొత్తం రూ.50లక్షల వరకు చుటుపక్కల ఉన్నటువంటి పరిశ్రమలకు తెలుగుదేశంపార్టీ నాయకులు అమ్ముకుంటున్నారని ఈనేపథ్యంలో ఓ అమాయకుడుపై ట్రాక్టర్ తొక్కించుకుని వెళ్ళి పోవడంతో మృతిచెందారన్నారు. పూడి, పెన్నలపాడు, కనపర్తి, విరూపాక్షపురం నుంచి తోలి లారీలుకి లోడ్‌చేసి చెన్నైకి తరలిస్తున్నారన్నారు. ప్రశ్నిస్తే అధికార పార్టీ నాయకులు అండదండలతో చేస్తున్నామని బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. స్థానిక ఎంఎల్ఏ దృష్టికి తీసుకెళ్ళి ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని వైకాపా సీనియర్ నాయకులు తెలిపారు.

## ఉభయదారుల సమావేశం రసాభాసా



కాణిపాకం, ఆగస్టు 11 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆదివారం స్థానిక మణికంఠేశ్వరాలయంలో ఆలయ ఉభయదారుల సమావేశం నిర్వహించారు. ఆలయ ఈఓ వెంకటేశు మాట్లాడుతూ సెప్టెంబర్ 7న వినాయకచవితితో ప్రారంభమయ్యే స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు 27న జరిగే తెప్పోత్సవంతో ముగుస్తుందన్నారు. ఈమేరకు సెప్టెంబర్ 7న వినాయకచవితితో ప్రారంభమయ్యే నవరాత్రి ఉత్సవాలు 16న జరిగే ధ్వజావరోహణంతో ముగుస్తుందన్నారు. అలాగే సెప్టెంబర్ 17న అధికార నంది వాహనంతో ప్రారంభమయ్యే ప్రత్యేక ఉత్సవాలు 27న జరిగే తెప్పోత్సవంతో ముగుస్తుందన్నారు. బ్రహ్మోత్సవాలను విజయవంతానికి సహకరించాలని తెలిపారు. పలువురు ఉభయదారులు పలుసమస్యలను ప్రస్తావించడంతో సమావేశం రసాభాసాగాతయారైంది. ఒక దశలో ఉభయదారులు పరస్పరం పెద్దఎత్తున వాగ్వివాదాలకు దిగడంతో ఉభయదారుల సమావేశంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. సంప్రదాయాలకు విరుద్ధంగా ఆలయ ప్రధాన అర్చకులు చదవాల్సిన ఆహ్వానపత్రికను ఆలయ వేదపండితునిచే చదివించడంతో ఆలయ అధికారులపై ఉభయదారులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనితో పత్రిక చదువుతున్న వేదపండితుని కూర్చోమని ఇన్‌చార్జి ప్రధాన అర్చకుడు ఆహ్వాన పత్రికను చదవడంతో ఉభయదారులు శాంతించారు. అలాగే ఉభయదారులకు సమావేశంలో అందించిన ఆహ్వాన పత్రికల్లో ఉభయ దారులకు సంభందించి వివరాలు లేకుండా ఇవ్వడంతో పలువురు ఉభయ దారులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వున్న అర్చకుల చేతనే ఉత్సవాలు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని, ఆలయంలో పనిచేస్తూ సస్పెండైన ధర్మేశ్వర గురుకుల్‌ను విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని పలువురు ఉభయదారులు అధికారుల దృష్టికి తీసుకురావడంతో సమావేశం రచ్చరచ్చగా మారింది. ఆలయ ఈఓ దేవస్థానంలో రాజకీయాలు చేస్తూ ఉభయదారుల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని కొందరు ఉభయదారులు ధ్వజమెత్తారు. ఉభయదారుల కమిటీ ఛైర్మన్ ఈశ్వర్‌బాబు, స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్, ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈవోలు రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, ఎస్వీ.కృష్ణారెడ్డి,ధనంజయ సూపరెంటెంట్‌లు కోదండపాణి, వాసు, ఆలయ మాజీ ఛైర్మన్‌లు మణినాయుడు, మోహన్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, మోహన్‌నాయుడులతో పాటు ఆలయ ఉభయదారులు పాల్గొన్నారు.

## బిందుసేద్యం పరికరాలకోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

పెద్దపంజాణి, ఆగస్టు11 ప్రభాతవార్త :



రాష్ట్రప్రభుత్వం రైతులకు రాయతీలో అందించే బిందుసేద్యం పరికరాలకోసం అర్హతకలిగిన రైతులు దరకాస్తుచేసుకోవాలని ఏడిఏ శివకుమార్,ఏఓ రఫీభా కోరారు.ఆదివారం మండలంలోని రాజుపల్లి, చామ నేరు,అప్పినపల్లి గ్రామాలను వారుసందర్శించి రైతులకు రాయతీపరకరాలపై మరియు ప్రభుత్వం అందించే రాయతీలపై అవగాహన కల్పించారు.ఐదుఎకరాలలోపు పొలంకలిగి నీటివసతి కలిగిన రైతులకు తొంబైశాతంమేరా డ్రిప్‌పరికరాల్లో రాయతీలభిస్తుందన్నారు అలాగే ఐదునుంచి పదిఎకరాల భూమికలిగిన రైతులకు డెబ్బైశాతంమేరా రాయితీ అందించడం జరుగుతుందన్నారు.చిన్నకారు రైతులకు స్పింక్లర్లకుగాను యబైఐదుశాతం పెద్దరైతులకు నలబైఐదుశాతం రాయతీ ఇస్తున్నట్లు తెలిపారు. .ఈ కార్యక్రమాల్లో సిబ్బంది విజయ్,శ్రీనివాసులు,రైతులు పాల్గొన్నారు.

## యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

**– తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం**

కుప్పంరూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త



యువత క్రీడా స్పూర్తితో ముందుకుసాగాలని కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధి పరమసముద్రంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు ఆదివారం బహుమతులు అందించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ యువత క్రీడల్లో గెలుపోటములు పట్టించుకోక ము ందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం గెలుపొందిన జట్లకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, నేతలు సత్యేంద్రశేఖర్, రవి, మాణిక్యం, మురుగేష్, ప్రతాప్‌సింహా, చెక్కునత్తం మణి, సంతోష్, వాసు, సుబ్బు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## వి.కోట సిఐగా సోమశేఖర్‌రెడ్డి బాధ్యతలు

వి.కోట, ఆగస్టు 11 ప్రభాతవార్త



వి.కోట నూతన సిఐగా సోమశేఖర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇదివరకు కర్నూలులో పనిచేశారు. ఇక్కడ సిఐ లింగప్పను చిత్తూరు విఆర్‌కు బదిలీ చేశారు. దీంతో నూతన సిఐగా సోమశేఖర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కూడా పోలీసుశాఖకు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## షూటింగ్ బాల్ విజేత రామకుప్పం జట్టు

వి.కోట/రామకుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త



వి.కోటలో జరిగిన అంతర్ జిల్లాల షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజేతగా రామకుప్పం డా॥ అంబేద్కర్ గురుకులం జట్టు నిలిచింది. ఫైనల్‌లో పల్నాడు జిల్లా విద్యార్థులతో పోటీపడగా రామకుప్పం గురుకులం జట్టు గెలుపొందింది. జట్టులోని ఆరుమంది విద్యార్థులు రామ్‌చరణ్ నాయక్, అజిత్ నాయక్, అమరనాథ్‌రెడ్డి, చరణ్, దినేష్, శేషాద్రిలు అత్యుత్త మంగా రాణించి విజేతలుగా నిలిచారని ప్రిన్సిపాల్ రాజేంద్ర తెలిపారు. క్రీడాకారులకు పారిశ్రామికవేత్త కోట్ల కిరణ్‌కుమార్‌రెడ్డి భోజన వసతి కల్పించారు. విజేతలకు చివరగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో షూటింగ్ బాల్ అసోసియేషన్ రాయలసీమ ఛైర్మన్ నరేష్, జిల్లా ఛైర్మన్ మహేష్, అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, కార్యదర్శి వేణుగోపాల్, మండల టిడిపి అధ్యక్షుడు రంగనాథ్, ధీరజ్, ఈశ్వర్, నాగభూషణం, సోము, కెజిసి వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, పిజి సెల్వం తదితరులు పాల్గొన్నారు.

## మాల మహానాడు నూతన కార్యవర్గం ఎన్నిక

చౌడేపల్లి, ఆగస్టు 11 ప్రభాతవార్త

మాల మహానాడు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. స్థానిక శ్రీలక్ష్మీశ్రీనివాసా కళ్యాణ మండపంలో ఆసంఘ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం, అధికార ప్రతినిధి మల్లెల మో హన్, శివల ఆధ్వర్యంలో జరిగిన ఏకగ్రీవ ఎన్నికల్లో నియోజకవర్గ ఇన్‌ఛార్జీగా ఆమినిగుంట కృపా మణి, గౌరవాధ్యక్షుడుగా మాజీ సర్పంచు వేణుగోపాల్, అధ్యక్షుడుగా కొత్తపల్లి మణి, ఉపాధ్యక్షులుగా కూరపర్తి ఈశ్వర్, రెడ్డిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బత్తలాపురం విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా నక్కా సురేష్, శ్రీరాములు, మండల యువజన అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ముకుందా, మణి, ప్రచార కార్యద ర్శులుగా అశోక్, వెంకట్రమణ, రాజశేఖర్, ప్యాయల శ్రీనివాసులు, శేఖర్‌బాబు, మరో 20మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిచే సంఘ నియమ నిబంధనలు పాటించాలని ప్రమాణం చేయించారు. ఎంఎంనాడు రాష్ట్ర నాయకులు అశోక్, గుండా మనోహర్, యమలా చంద్రయ్య, వీరభద్ర, కలికిరి హరి, జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, నియోజకవర్గ బిఎస్‌పి ఇన్‌ఛార్జీ వసంతపల్లి సురేష్, వెంకటస్వామి, నరేష్, సుబ్రమణ్యం, లక్ష్మీపతి, చిత్తూరు జిల్లా నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## సిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం

కాణిపాకం, ఆగస్టు 11 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థా నంలో అమలవుతున్న శ్రీసిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు ఆదివారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు నంద్యాలకు చెందిన మనోహర్‌రెడ్డి అనే భక్తుడు ఈపథకానికి 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలిసి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవికి అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై వైకాపా తప్పుడు ప్రచారం

**– రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీ సురేంద్రకుమార్**

చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:

రాష్ట్రంలో ఎన్డీఎ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రభుత్వంపై వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీ సురేంద్రకుమార్ ఆరోపించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వమే విజయవాడలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహంపై దాడి చేయించిందని, శిలాఫలకాల నుండి వైఎస్ జగన్ పేరును తొలగించిందని, అంబేద్కర్ విగ్రహంను కూల్చివేయడానికి ప్రభుత్వం ప్రయత్నించిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వైకాపా రాజకీయ లబ్ది కోసమే ఇలాంటి తప్పుడు ప్రచారంను ప్రారంభించిందని ఆయన ఆరోపించారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో తీసుకువచ్చి సమర్పించుకోవచ్చును. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి అక్కడికక్కడే క్షేత్ర స్థాయిలో సమస్యను అధికారుల ద్వారా తెలుసుకుని పరిష్కరిస్తారు.జిల్లా అధికారులందరు హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

## నీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే గురజాల

గుడిపాల, ఆగస్టు 11 ప్రభాతవార్త:



మండలంలోని రామభద్రాపురం పంచాయతీ చుక్కలవారిపల్లి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యలను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పరిష్కరించారు. ఎన్నికల ప్రచార సమయంలో గ్రామ ప్రజలకు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గురజాల జగన్మోహన్‌నాయుడు తాను ఎన్నికల్లో విజయం సాధిస్తే గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే నిధులతో మంజూరైన బోరును స్థానిక సర్పంచ్ గొల్ల హారిణి హేమాద్రినాయుడు ఆధ్వర్యంలో డ్రిల్ చేశారు. గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడును సర్పంచ్ గొల్ల హారిణి హేమాద్రినాయుడు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థుల సౌకర్యంకు అనుగుణంగా అర్టీసీ బస్సు

గుడిపాల, ఆగస్టు 11 ప్రభాతవార్త:

విద్యార్థుల పాఠశాల సమయానికి అనుగుణంగా అర్టీసీ బస్సును నడపాలని గ్రామ ప్రజలు, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్, హెడ్మాస్టర్‌లు కోరారు. చిత్తపార నుండి ఎన్‌ఆర్ పేట జడ్పీ పాఠశాలకు 40 మంది విద్యార్థులు వస్తున్నారని అయితే సాయంత్రం వేళల్లో చిత్తపార వరకు వెళ్ళడానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పాఠశాల హెడ్మాస్టర్ కాతుంబి, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఢిల్లీబాయ్ అర్టీసీ అధికారులకు విన్నవించారు. పాఠశాల సాయంత్రం 4 గంటలకు ముగుస్తుందని, అయితే చిత్తపారకు వున్న ఒకే ఒక్క అర్టీసీ బస్సు సాయంత్రం 6 గంటలకు గుడిపాలకు చేరుకోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు అర్టీసీ అధికారులకు తెలిపారు. ఈ బస్సు సమయం సాయంత్రం 4.30 గంటలకు మార్చితే విద్యార్థులకు సౌకర్యంగా వుంటుందని ఆ మేరకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు అర్టీసీ అధికారులను కోరారు.

## గ్రామాల్లో దేశం పార్టీ పతాకావిష్కరణలు

రామకుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త

మండలంలోని బందార్లపల్లి, ఉన్సిగానిపల్లి, రామకుప్పం, గౌరివిమాకులపల్లి, కెంపసముద్రం తదితర గ్రామాల్లో మండల టిడిపి అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి తెలుగుదేశం పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అధికారులు పార్టీల జెండాలు తొలగించిన నేపథ్యంలో పార్టీ అధిష్టానం ఆదేశాలతో నూతనంగా జెండాలను ఆవిష్కరిస్తున్నారు. కార్యక్రమంలో నేతలు నరసింహులు, మున స్వామి, నందారెడ్డి, రామకృష్ణప్ప, మునిరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనాథరెడ్డి, అక్బర్, టివి రవి, నియాజ్, బాలరాజు, సుబ్రి, సతీష్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రోడ్డు ప్రమాదంలో వివాహిత మహిళ మృతి

తవణంపల్లె, ఆగస్టు 11 ప్రభాతవార్త:



మండలంలోని తిరుపతి–బెంగుళూరు సిక్స్‌లేన్ జాతీయ రహదారి కె.పట్నం వద్ద ఆదివారం చోటుచే సుకుంది. సంఘటనకు సంభందించి స్థానిక ఎస్‌హెచ్‌ఓ అమీర్ కథనం మేరకు వివరాలిలావున్నాయి. ఐరాల మండలం రెడ్డివారిపల్లెకు చెందిన చంద్రమ్మ(48), సుధాకర్‌రెడ్డి దంపతులు గుడిపాల మండలం చిత్తపార గ్రామంలోని తమ బంధువుల ఇంటికి వెళ్ళి మోటారు సైకిల్‌పై తిరిగి వస్తుండగా తిరుపతి వైపు వెళుతున్న కంటైనర్‌ను కె.పట్నం వద్ద సిక్స్‌లేన్ సర్వీసు రోడ్డు నుండి మెయిన్‌రోడ్డులోకి డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ రావడంతో మోటారు సైకిల్ ఢీకొన్నాడు. మోటారు సైకిల్‌పై వెనుక వైపు కూర్చొన్న చంద్రమ్మ కంటైనర్ చక్రాల కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త సుధా కర్‌రెడ్డి స్వల్ప గాయాలతో ప్రమాదం నుండి బయటపడ్డాడు.ఈమేరకు కేసు నమోదు చేసుకుని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు అమీర్ తెలిపారు.

## స్టేట్ లెవెల్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన ఏర్పేడు విద్యార్థులు

ఏర్పేడు, ఆగస్టు11ప్రభాతవార్త;



స్టేట్ లెవెల్ షూటింగ బాల్ పోటీలకు ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతికి చెందిన విద్యార్థులు శనివారం చిత్తూరు జిల్లా వి కోటలో నిర్వహించిన పోటీలో పాల్గొన్నారు. తిరుపతి జిల్లా టీంకు హర్షవర్ధన్,జయవర్ధన్ అనే విదార్థులు ఎంపికయ్యారు.ఈసందర్బంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె సునీత, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రశంసిస్తూ స్టేట్ లెవెల్‌ల్లో కూడా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అకాంక్ష వ్యక్తం చేశారు. అదేవిదంగా విద్యార్థులకు కోచింగ్ ఇచ్చిన పిడి శివకుమార్‌కు అభినందనలు తెలిపారు.

## ఎస్టీ పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ

ఏర్పేడు, ఆగస్టు 11, ప్రభాతవార్త;



మండలంలోని రాజులపాళ్యం, చిందేపల్లి ఎస్టీ కాలనీల్లో ఉన్న పిల్లలకు ఆదివారం యువ నేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మునిశేఖర్ దాతల సహకారంతో విద్యా సామగ్రి, జత బట్టలు పంపిణీ చేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు మారుతున్న కాలంతో పాటుగా మారి పిల్లల్లో మార్పు తీసుకొచ్చే విధంగా ప్రతి రోజూ బడికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలు బాగా చదువుకుంటేనే భావితరాలు బాగు పడటమే కాకుండా, గిరిజన కాలనీలు కూడా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో యువ నేస్తం అసోసియేషన్ మండల కోఆర్డినేటర్ అరుణ, వాలంటీర్ మౌనిక, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రామ దేవతలకు పొంగళ్ళు

ఏర్పేడు, ఆగస్టు11, ప్రభాతవార్త;



మంలంలోని క్రిష్ణంపల్లి గ్రామస్తులు ఆదివారం ఘనంగా గ్రామ దేవతలకు పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమానికి హాజరైన రాష్ట్ర టిడిపి అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్బంగా పార్టీ సీనియర్ నాయకులు పేట బాలాజీ రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, పార్లమెంట్ బిసి ఉపాధ్యక్షులు రాచేటి సుబ్రమణ్యం, పార్లమెంట్ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి కేకే రమణ, మండల యువత అధ్యక్షులు గుణయాదవ్, మండల బీసీ సెల్ అధ్యక్షులు మునయ్య, పార్టీ నాయకులు మురళీ యాదవ్,వెంకటస్వామి,చంద్రారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, చంద్రా, హరి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు వెస్ట్ సీఐగా శ్రీధర్‌నాయుడు బాధ్యతలు స్వీకరణ

చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త:

చిత్తూరు రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బి.శ్రీధర్‌నాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఇన్‌సపెక్టర్‌ల బదిలీల్లో కడప జిల్లాలో ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌నాయుడును చిత్తూరు వెస్ట్ సీఐగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఈమేరకు ఆయన ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అలాగే ఇక్కడ విధులు నిర్వహస్తున్న సీఐ రవిశంకర్‌రెడ్డిని చిత్తూరు విఆర్‌కు బదిలీ చేశారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వైకాపా ముంచింది.. కూటమి పంచింది

**తెదేపా నేత తీగల సురేష్**

కోట,ఆగస్టు 11 ప్రభాతవార్త

రైతు భరోసా కేంద్రాలల్లో కొనుగోలు చేసిన ధాన్యానికి 21 రోజుల్లో ఖాతాల్లో నగదు జమ చేస్తామని చెప్పి రైతులను వైకాపా ప్రభుత్వం నిండా ముంచిందని తిరుపతి జిల్లా తెదేపా బిసి సెల్ ప్రధాన కార్యదర్శి,తీగల సురేష్‌బాబు ఆరోపించారు. ఆయన కోటలో ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధాన్యం బకాయిలపై ప్రత్యేక్య దృష్టి సారించడం జరిగిందన్నారు.ఇప్పటికే రూ 1000 కోట్లు రైతుల ఖాతాకు జమ చేయగా మిగిలిన రూ 674 కోట్లు ఈనెల 12 న చెల్లించునున్నారని పేర్కొన్నారు.రైతులు గత రబీ సీజన్ పండించిన ధాన్యంను రైతులు ఎక్కువ మంది ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకున్నారని ఆయన ఆరోపించారు. ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసింది తక్కువేనన్నారు. రైతులకు సకాలంలో సొమ్ములు చెల్లించకుండా నాటి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేసిందన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తమ ప్రభుత్వం 100 శాతం పూర్తి చేయడం జరుగుతుందన్నారు. గూడూరు శాసన సభ్యులు డా.పాశిం సునీల్ కుమార్ అధ్వర్యంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

## పాదర్శకంగా టీచర్ల సర్దుబాటు

కోట,ఆగస్టు 11 ప్రభాతవార్త

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించడానికి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టిందిని ఎంఇఓ మస్తానయ్య చెప్పారు. ఆయన ఆదివారం కోటలో విలేకర్లతో మాట్లాడుతూ మిగులు టీచర్లును సబ్జెక్టుల వారీగా అవసరం ఉన్న చోట సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు.సోమ, మంగళవారాల్లో తుది కసరత్తు పూర్తి చేసి ఈ ప్రక్రియ పూర్తి పాదర్శకంగా ఉండేలా ఆన్‌లైన్‌లో విధానంలో చేస్తుండటంతో ఉపాధ్యాయులకు మేలు జరుగుతుందన్నారు. మండలంలో విద్యాకమిటి ఎన్నికలు గోవిందపల్లి ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, ఊనుగుంటపాళెం యుపి పాఠశాలలో నిలిచి పోయ్యాయిని వాటికి ఈనెల 17న ఎన్నికలును నిర్వహిచడం జరుగుతుందన్నారు.ఆయా గ్రామాల పాఠశాల విద్యార్దులు తల్లి దండ్రులు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహిచేందుకు సహకరించాలని ఆయన కోరారు.

## సిఐగా బాధ్యతలు చేపట్టిన ఏవి రమణ



వెంకటగిరి, ఆగస్టు 11, ప్రభాతవార్త

సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఏ. వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. అందరి సహాయ సహకారాలతో విధులను సమర్ధవంతంగా నిర్వహిస్తానని సిఐ తెలిపారు. పట్టణంలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య, ఈవ్‌టీజింగ్, చీరిల నివారణ వంటివి అరికట్టాలని తెలిపారు. పలువురు ఎస్ఐలు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

## ఎమ్మెల్యే గారి భరోసా.. దుకాణదారుల హర్షం

కోట, ఆగస్టు 11 ప్రభాతవార్త

కోట పట్టణంలోని ఆర్‌అండ్‌బి రోడ్డు పక్కన దుకాణదారులకు గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఉపాధి భద్రతపై భరోసా కల్పించడంతో దుకాణదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆ మేరకు ఆదివారం 25 కుటుంబాల దుకాణదారులు విలేఖరులతో మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం తామంతా సొంత నిధులతో చిన్నచిన్న గదులు నిర్మించుకొని చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. అయితే తమను అటు పంచాయతీ అధికారులు, ఇటు ఆర్టీసీ అధికారులు రకరకాలుగా మానసిక ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా ఇటీవల ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను కలిసి గోడు వినించుకోగా ఆయన స్పందించి తమకు భద్రత కల్పిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 30 ఏళ్ల సుదీర్ఘపోరాటంతో నూతన కూటమి ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని చిరు వ్యాపారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ పేదలకు అండగా నిలుస్తున్నారని వారు గుర్తు చేశారు.

## గూడూరు పట్టణ సిఐగా బాధ్యతలు స్వీకరించిన శేఖర్ బాబు

గూడూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త



గూడూరు ఒకటవ పట్టణ సిఐగా శేఖర్ బాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో గూడూరు ఒకటవ పట్టణం, చిల్లకూరు, ఓజిలి ఎస్ఐగా పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీల్లో భాగంగా గూడూరు ఒకటవ పట్టణ సిఐగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా కృషి చేస్తామన్నారు. అనంతరం సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

## గూడూరు డిఎస్పీగా రమణ కుమార్ బాధ్యతల స్వీకరణ

గూడూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త



గూడూరు సబ్ డివిజన్‌లో శాంతిభద్రతలను పరిరక్షణకు పోలీసులు నిరంతరం పనిచేస్తూ ఉంటారని బేసిక్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామని గూడూరు నూతన డిఎస్పి రమణ కుమార్ వెల్లడించారు. ఆదివారం గూడూరు సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో ఆయన డిఎస్పిగా బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు నుండి గూడూరు డిఎస్పిగా బదిలీ అయ్యారు. అనంతరం పలువురు సిఐలు, ఎస్ఐలు, డిఎస్పిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గూడూరు డిఎస్పి రమణ కుమార్ మాట్లాడుతూ నేడు గూడూరు డిఎస్పిగా బాధ్యతలు స్వీకరించామని ఇప్పటి వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పనిచేయలేదని , ప్రకాశం, గుంటూరు జిల్లాలో పనిచేశామని తెలిపారు. బేసిక్, విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇచ్చి సిబ్బంది విధిగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నేర నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు.

## సిరామిక్ యూత్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

గూడూరు, ఆగస్టు 11, ప్రభాతవార్త



గూడూరు రెండవ పట్టణ పరిధిలోని సిరామిక్ రోడ్డు నందు వెలసియున్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం సిరామిక్ యూత్ ట్రస్ట్ 5వ వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసు పత్రి నందు గర్భిణీ స్త్రీలకు రోగులకు బ్రెడ్ జ్యూస్ పంపిణీ చేసా రు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డాక్టర్ గిరి జా, సిరామిక్ యూత్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సిరామిక్ యూత్ ట్రస్ట్ సేవలు అభినందనీయం అన్నారు. భవిష్యత్‌లో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. అదే విధంగా రెండవ పట్టణంలోని నర్సింగరావు పేట నందు ఉన్న బాలసదనం, అంగన్‌వాడి కేంద్రంలో కుర్చీలు వాటర్ క్యాన్, పిల్లలకు బిస్కెట్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మహబూబి, సూపర్‌వైజర్ హైమావతి, జ్యోత్స్న, సుప్రియ, సిరామిక్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## వాకాడు సిఐగా హుస్సేన్ భాష

వాకాడు, ఆగస్టు 11, ప్రభాతవార్త



వాకాడు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఎస్‌కె హుస్సేన్ భాష ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో చిల్లకూరు పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేశారు. ఇక్కడ పని చేసిన సిఐ హరికృష్ణ బాపట్లకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హుస్సేన్ భాష బాధితులు స్వీకరించారు. సర్కిల్ పరిధిలోని ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చూసుకుంటానని తెలిపారు. సమస్య పరిష్కారానికి సత్వరమే న్యాయం చేస్తానని తెలిపారు.

## దళితుల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యం

**– ఎస్సీల గురించి మాట్లాడే అర్హత వైసీపీకి లేదు**

**– నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి నాగార్జున**

చిట్టమూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త

దళితుల గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదని, దళితుల అభ్యున్నతి కోసం అహర్నిశలు పాటుపడేది టిడిపి అని గూడూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి యలసిరి నాగార్జున అన్నారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అంబేద్కర్ రాజ్యాంగాన్ని విస్మరించి రాష్ట్ర వ్యాప్తంగా దళితులను అణచివేతకు గురిచేశారన్న వాస్తవాలను వైసీపీ నేతలు గుర్తు పెట్టుకోవాలన్నారు. రాజకీయ లబ్ధి కోసం దళితులను వాడుకుంటే ఎస్సీ, ఎస్టీలు క్షమించ రన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక పెత్తందారు అని, ఆయనకు ఎదురు మాట్లాడిన సందర్భాల్లో ఎస్సీలను వైసీపీ ప్రభుత్వం ఎలా అణచివేసిందో ప్రజలు గుర్తుపెట్టుకొని జరిగిన ఎన్నికల్లో ఘోరంగా ఓడించిన సంగతిని మరచిపోకూడదన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆరువేలకు పైగా దాడులు జరిగాయని, 188 మంది దళితులు హత్యకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరం దళితుల ఓట్లు కోసం పాటుపడే వైసీపీ వారి అభ్యున్నతికి ఏనాడూ కృషి చేయలేదని ఈ సందర్భంగా నాగార్జున విమర్శించారు.

## నేటి నుంచి సర్పంచులకు శిక్షణా తరగతులు

చిట్టమూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త

సోమవారం నుంచి మూడురోజులు పాటు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ షాలెట్ తెలిపారు. మొదటి రోజు శిక్షణా తరగతుల్లో భాగంగా పంచాయతీ నిధులు, బాధ్యతలతో పాటు పంచాయతీరాజ్ చట్టం, పారిశుధ్యం, వ్యర్ధాలు నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. గ్రామ పంచాయతీలకు విడుదల చేస్తున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల గ్రాంట్లు వంటి అంశాలపై ప్రణాళిక విశ్లేషణ చేయనున్నట్లు ఎంపిడిఓ చెప్పారు. రెండోరోజు గ్రామ పంచాయతీ అభివృద్ధి, ప్రణాళిక, వర్మికంపోస్టు మార్కెటింగ్‌లతో పాటు మూడోరోజు వీధిదీపాలు ఏర్పాటు, నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించిన అనంతరం సర్పంచులు, కార్యదర్శులకు పరీక్ష నిర్వహిస్తామని ఆమె చెప్పారు. సర్పంచులు, కార్యదర్శులు అందరూ ఈ శిక్షణా తరగతులకు హాజరు కావాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు.

## కోట ఎంపిడివోగా మారెళ్ల భవాని

కోట,ఆగస్టు 11 ప్రభాతవార్త

కోట మండలాభివృద్ధి అధికారిగా మారెళ్లభవాని ని ప్రభుత్వం నియమిచింది.ఎన్నికలకు ముందు గత ప్రభుత్వంలో ఆమె కోటలో ఎంపిడివోగా పని చేశారు. సాధారణ ఎన్నికల నేపద్యంలో ఆమెను చిత్తూరు జిల్లాకు బదిలీపై వేళ్లారు. ప్రస్తుతం కోట మండలానికి తిరిగి ఎంపిడివోగా నియమించబడ్డారు. ఈమెకు మండలంపై పూర్తి అవగాహన ఉంది. దీంతో రెండు పార్టీల నాయకులు ఆమె రాకను స్వాగతిస్తున్నారు.ఇక్కడ ఎంపిడివో గా పని చేసిన శంకరయ్య సొంత జిల్లాకు బదిలీపై వేళ్లారు.

## హనుమదీశ్వర విగ్రహం ఆలయాల నిర్మాణాలు పూర్వజన్మ సుకృతం

చౌడేపల్లి, ఆగస్టు 11 ప్రభాతవార్త



హనుమదీశ్వర విగ్రహం, ఆలయాల నిర్మాణాలు చేపట్టడం తన పూర్వజన్మ సుకృతమని సనాతన ధర్మ పరిరక్షణ పురస్కార గ్రహీత, బోయకొండ ఆలయ మాజీ ఛైర్మన్ ఎస్.కె.వెంకట్రమణారెడ్డి అన్నారు. మండలంలోని పంచాయతీ కేంద్రం ఎ.కొత్తకోట వద్ద ఎస్కెఆర్ సొంత నిధులు రూ. 10కోట్లతో నిర్మిస్తున్న 60అడుగుల హనుమదీశ్వరుని విగ్రహం, షిర్డీసాయి బాబా, అయ్యప్పస్వామి, కళ్యాణ వెంకటేశ్వరస్వామి, పేదల కోసం కళ్యాణ మండపం పనులను పర్యవేక్షిం చారు. రాష్ట్రం నుంచి కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన స్థపతి, ఇంజనీరింగ్ అధికారుల సలహాలు, సూచనలతో శరవేగంగా పనులు జరుగుతున్నట్లు వివరించారు. దక్షిణకాశీ అగస్తీశ్వరస్వామి కొండ, చంద్ర మౌళీశ్వరస్వామి ఆలయం, బోయకొండ గంగమ్మ ఆలయాల నడుమ ఆహ్లాదకరమైన వాతావరణంలో దేవాలయాల నిర్మాణాలు చేపడుతున్నానన్నారు. అలనాటి జ్ఞాపకాలైన దేవాలయాల పున ర్నిర్మాణమే ధ్యేయంగా తన జీవితం కొనసాగుతోందనీ, మరిన్ని ఆలయాల జీర్ణోద్ధరణకు కృషి చేస్తున్నా మన్నారు. ముఖ్యంగా సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తూ, సమాజంలో దైవ చింతన ఉండాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు వివరించారు. తేదేపా నాయకుడు జల్లి మనోహర్, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

## ఆకట్టుకున్న దుర్యోధన వధ

పాకాల, ఆగస్టు 11, ప్రభాతవార్త



పాకాల మండలం దామలచెరువు గ్రామ పంచాయితీ మబ్బునాయన పల్లిలో మబ్బునేని చైతన్య కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న మహా భారత మహోత్సవాలలో చివరి రోజైన ఆదివారం సాయంత్రం నిర్వహించిన దుర్యోధన వధ ఘట్టం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. దుర్యో ధన, భీమ వేషదారుల సంవాదాన్ని ప్రజలు అత్యంత ఆసక్తిగా తిలకించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో అక్కడకు చేరుకొని కార్యాక్రమాన్ని తిలకించారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశం, ధర్మరాజ పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్రౌపతమ్మ వారికి మొక్కులు ఉన్న ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. చంద్రగిరి వారిపల్లికి చెందిన మామిడికాయల వ్యాపారి గోవర్ధన్ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మబ్బునేని రఘుపతి, ట్రస్ట్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# నాడు తాత్కాలికం...నేడు శాశ్వతం

**ఎప్పటికప్పుడు నిర్ణయాలు మార్చుకుంటున్న అధికారులు**

శ్రీకాళహస్తి, ఆగస్టు 11 ప్రభాతవార్త : మహాశివరాత్రికి ముందు మూడవ గోపురం వద్ద సంప్రదాయబద్దంగా నిర్మించిన రాతిమెట్లపై ఏర్పాటు చేసిన చెక్క మెట్లు తాత్కాలికమని విమర్శలపై వివరణ ఇస్తూ ఇఇ నూకారత్నం తెలిపారు. అయితే శివరాత్రి వెళ్ళి నాలుగు నెలలు గడుస్తున్నా వాటిని తీయకపోవటంపై వెల్లువెత్తుతున్న విమర్శలపై వివరణ ఇచ్చిన డిఇఇ శ్రీనివాసులురెడ్డి అవి తాత్కాలికం కాదని శాశ్వత మని చెబుతున్నారు. భక్తుల సౌకర్యార్థం వాటిని అలాగే కొనసాగిస్తున్నట్లు తెలిపారు.


మోక్షగోపురం వద్ద చెక్క మెట్లు

**స్పష్టత లేదని ఇంజనీరింగ్ విభాగం:**
శ్రీకాళహస్తీశ్వరాయంలో సుమారు పాతిక మంది ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్నారు. అయితే ఇక్కడ జరిగే అభివృద్ధికి సంబంధించి ఉద్యోగుల్లో సమన్వయం లేదు. స్పష్టత లేదు. ఏదైనా ఏర్పాట్లుకు సంబంధించి వివరణ కోరటానికి ప్రయత్నిస్తే ఇఇ ఫోన్ తీయరు. తీరా విచారిస్తే ఆ అధికారి సెలవు. ఇక డిఇఇ ఎప్పుడు ఫోన్ తీస్తారో దేవునికే ఎరుక. ఇంజనీరింగ్ విభాగంలో మరో శాఖ ఎలక్ట్రికల్ ఇంజనీర్. దేవస్థానం సారథ్యంలో ఏ పనులు ఎక్కడ జరుగుతున్నాయో చెప్పలేని స్థితి. ఇందుకు ఉదాహరణ ఆలయం తరఫున సన్నిధివీధిలోని కార్‌పార్కింగ్‌ల వద్ద (రాజగోపురం, పాత ధూర్జటి కళాప్రాంగణం వద్ద) సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వాటికి సంబంధించి సంబంధిత ఇంజనీర్ మురళిని వివరణ కోరగా (శనివారం సాయంత్రం) తాము ఎక్కడా సిసి కెమెరాలు ఏర్పాటు చేయటం లేదన్నారు. తీరా ప్రభాతవార్త ఆదివారం ఫోటోలు చూపితే అవి తమ శాఖే ఏర్పాటు చేస్తుందన్నారు. మరి శనివారం ఏమో తమది కాదన్నారు? ఆదివారం తామే ఏర్పాటు చేస్తామన్నారు. అంటే ఆలయంలో జరుగుతున్న పనులకు సంబంధించి వారి జవాబుదారి తనం ఏమిటో అర్థమౌతుంది.

**ఆగిన పనుల గురించి పట్టించుకునే దిక్కులేదు:**
శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన తేరువీధిలోని వాహనాల మండపం పనులు సుమారు 10 సంవత్సరాల నుంచి సాగుతూనే ఉన్నాయి. మహాశివ రాత్రి ముందు పనులు జరుగుతున్నట్లు హంగామాలు సృష్టిస్తారు. కానీ ఒరెండు రాళ్ళకు పూతలు పూసి చేతులు దులుపు కుంటారు. అలాంటి కాంట్రాక్టర్ మీద ఇంజనీరింగ్ విభాగం ఎందుకు చర్యలు తీసుకోదనేది విమర్శలుగా ఉన్నాయి. ఆలయం వద్ద నిధులు లేవా? అంటే పనులు జరిగిన వెంటనే చెల్లింపు చేస్తారు. కాంట్రాక్టర్ల పట్ల ఇంజనీరింగ్ విభాగం ఉదాసీన వైఖరి ఎందుకనేది చర్చనీయాంశంగా మారింది. గత ఐదేళ్ళలో ఇంజనీరింగ్ విభాగం చేసిన పనులకు సంబంధించి శాసనసభ్యులు కోరిన వివరాలు ఇచ్చినట్లు తెలిసింది. ఈ శాఖ చేపట్టిన పనుల్లో వందల కోట్లు అవినీతి జరిగినట్లు చర్చించుకుంటున్నారు. ఈ సస్పెన్స్ ఏమిటో గుట్టు రట్టు చేయాల్సింది శాసనసభ్యులే!

# సంస్కృత భాష అత్యంత ప్రాచీనమైన భాష జ్ఞానానికి నిధి



తిరుపతి విద్య, ఆగస్టు 11 ప్రభాతవార్త : జాతయ సంస్కృత వర్సిటీలో అన్నారవు సభాభవనం నందు సిడాక్, బెంగళూరు, నేషనల్ సాంస్క్రిట్ యూనివర్సిటీ తిరుపతి సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడాక్, బెంగళూరు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. ఎస్.డి సుదర్శన్ విచ్చేసి, విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొ. జిఎస్ఆర్ కృష్ణమూర్తితో కలిసి జ్యోతి ప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథి డా. ఎస్‌డి సుదర్శన్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కంప్యూటర్స్ అత్యంత ముఖ్యమైనటువంటి పాత్ర పోషిస్తున్నాయని, సంస్కృత భాషలో ఉన్నటువంటి జ్ఞానాన్ని సిడాక్ సంస్థతో కలిసి ఆధునిక తరానికి అందించాలి అనేటువంటి సత్సంకల్పంతో ఆదివారం ఈ సదస్సుని నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ప్రాచీన సంస్కృత వాంఙ్మయంలో ఉన్నటువంటి అత్యంత అరుదైన గ్రంథాలను, వాటిలో ఉన్నటువంటి జ్ఞానాన్ని సంగ్రహించి వాటిని కంప్యూటేషనల్ టూల్స్ ద్వారా పబ్లిక్ డొమైన్‌లోకి తీసుకురావడమే ముఖ్య లక్ష్యమని వర్ణించారు. సంస్కృత భాష అత్యంత ప్రాచీనమైన భాష, జ్ఞానానికి నిధి ఆయన ఈ సందర్భంగా వివరించడం జరిగింది. అనంతరం విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సీడాక్ సంస్థతో పరస్పర అవగాహన ఒప్పందం కార్యక్రమం చేసుకుని తద్వారా సంస్కృత జ్ఞానాన్ని ఆధునిక తరానికి కంప్యూటేషనల్ టెక్నాలజీ ఉపయోగించి అందించడం జరుగుతుందని వివరించారు. విశ్వవిద్యాలయం ఇనార్జి రిజిస్ట్రార్ ప్రొ. ఆర్జే రమాశ్రీ మాట్లాడుతూ ఈ సీడ్యాక్ వారితో విశ్వవిద్యాలయం అద్వైత వేదాంత విభాగం వరిష్ట ఆచార్యులు ప్రొ. కె. గణపతి భట్ వ్యవహరించి ఈ సదస్సు ఉద్దేశాన్ని అదే విధంగా సిడాక్‌తో జరిగేటటువంటి కార్యక్రమాలను వివరించి, సభను దిగ్విజయంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఆర్ఓ ప్రొ. వి. రమేష్ బాబు, వర్సిటీలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, సిడాక్ బృందం, ఇతర విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

## ముఠా కార్మికుల భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



గూడూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని శ్రీ బాలాజీ లెమన్ మార్కెట్ నందు ముఠా కార్మికుల కోసం నూతనంగా నిర్మించిన విశ్రాంతి భవనంను ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెమన్ మార్కెట్‌లో ముఠా కార్మికులు విశ్రాంతి తీసుకునేందుకు 14లక్షల రూపాయిలతో విశ్రాంతి గదిని ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో లెమన్ మార్కెట్ అధ్యక్షులు తలమంచి సిద్ధా రెడ్డి, ఉపాధ్యక్షుడు బెల్లం శ్రీహరి నాయుడు, సెక్రటరీ ఇనుకుర్తి రామా నాయుడు, కోశాధికారి బిల్లు పెంచలయ్య, ముఠా యూనియన్ వర్కర్స్ నాయకులు గారాబాబు రావు, ముప్పాల లక్ష్మి నారాయణ, గూడూరు మండల పార్టీ అధ్యక్షులు కొండూరు వెంకటేశ్వర్లు రాజు, పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు తాతపూడి ఇశ్రాయేలు కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు ఆరికట్ల మస్తాన్ నాయుడు, పిట్టి నాగరాజు, ముఠా కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయస్వామికి అభిషేకాలు



సదుం, ఆగస్టు11ప్రభాతవార్త : శ్రావణ మాసం ప్రారంభం కావడంతో వివిధ ఆలయాలలో ప్రత్యేకంగా అభిషేకాలు ,పూజలు తదితరాలు ప్రారంభమైనాయి. ఈక్రమంలో మండల పరిదిలోని తాటిగుంట పాలెంలో వెలసిన శ్రీ అభయాంజనేయస్వామి వారి ఆలయంలో ఆదివారం గ్రామస్థులు స్వామి వారికి ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. ఈసందర్బంగా స్వామి వారికి తొలుత నూటొక్క బిందెల నీటితో అభిషేకం జరిపారు. అనంతరం ప్రత్యేక సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. విశేషంగా అలంకరించిన తర్వాత తమలపాకులతో ఆకు పూజ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన గోవింద్‌శెట్టి, మేనక, రంజిత్‌కుమార్‌ల కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వైకాపా నేత గిరిధర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కాణిపాకం బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభం



కాణిపాకం, ఆగస్టు 11 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో సెప్టెంబర్ 7 నుండి జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు దేవస్థానం ఏర్పాట్లును ప్రారంభించింది. దేవస్థానంలో సెప్టెంబర్ 7 నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతిఏటా 21 రోజులు పాటు జరిగే ఈఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహి స్తుంటారు. బ్రహోత్సవాల నిర్వహణకు కేవలం 25 రోజుల వ్యవధి మాత్రమే వుండడంతో ఆలయ అధికారులు ఏర్పాటును ప్రారంభించారు. ఈమేరకు ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలకు రంగులు వేయడం, ప్రధాన ఆలయంలో రంగవల్లులు తీర్చిదిద్దడం వంటి పనులను చేపట్టారు. ముఖ్యంగా గతంలో ప్రధాన ఆలయ రాజగోపురాలకు వున్న పంచవర్ణ రంగుల స్థానంలో ఆగమ శాస్త్ర ప్రకారం రంగులను వేస్తున్నారు. మిగిలిన ఏర్పాట్లును సకాలంలో పూర్తి చేయడానికి ఆలయ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

## గంగమ్మ గుడి నిర్మించేదెప్పుడు!

**- ఆలయ నిధులపై వివరణ ఇవ్వాలని 18 గ్రామాల ప్రజలు డిమాండ్**

శ్రీరంగరాజపురం, ఆగస్టు 11 ప్రభాతవార్త: శ్రీరంగరాజపురం మండల పరిధిలో ప్రసిద్ది చెందిన ఆరిమాకులపల్లె గ్రామం ఆరిమాకు గంగమ్మ ఆలయం నిర్మాణంలో జాప్యం ఎందుకు జరుగుతుందని తయ్యూరు పాయకట్టు 18 గ్రామాల ప్రజలు ఆదివారం నిలదీశారు. అలాగే గంగమ్మ దేవాలయ ఆదాయ, వ్యయాలపై అధికారులు వివరణ ఇవ్వాలని కోరారు. గంగమ్మ గుడి ఆవరణలో ఆదివారం అయ్యూరు పాయకట్టు 18 గ్రామాలకు చెందిన ప్రజలు గంగమ్మ దేవాలయ నిర్మాణంపై జరుగుతున్న జాప్యంపై చర్చించడానికి సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పాయకట్టు గ్రామాల ప్రజలు మాట్లాడుతూ రెండేళ్ళ క్రితం బాగున్న గంగమ్మ ఆలయంను కూలగొట్టి నూతన ఆలయం నిర్మిస్తామని చెప్పిన అప్పటి ఆలయ కార్యనిర్వాహకులు ఇప్పటికీ పనులు చేపట్టి పూర్తి చేయకపోవడంపై ప్రజలు ప్రశ్నించారు. రెండేళ్ళ క్రితం ప్రారంభమైన ఆలయ పనులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, అసలు గంగమ్మ ఆలయానికి ఆదాయం ఎంత వస్తుంది! ఖర్చు ఎంత చేస్తున్నారు! అనే విషయాలపై పాయకట్టు గ్రామాల ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇది వరకు వున్న కార్య నిర్వాహకులు ఆలయ నిర్మాణం కోసం పలువురి వద్ద నిధులు వసూలు చేసి సొంతానికి వినియోగించున్నారని ఆరోపణలు వున్నాయని వీటిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆలయానికి బోర్డు వున్నప్పటికీ బోర్డు సభ్యులందరు నామమాత్రులని ఒక్కరే ఎవరికి చెప్పకుండా పనులు చేపడ్తున్నారని ఆరోపించారు. గంగమ్మ ఆలయ నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై మొదట ఎమ్మెల్యే డాక్టర్ థామస్ దృష్టికి తీసుకెళ్ళాలని, ఆపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని సమావేశం నిర్ణయించింది. అలాగే ఆలయ ఆదాయ, వ్యయ ఖర్చులపై ఆలయ ఇఓ ఆలయ ఆవరణలోనే పాయకట్టు గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించి వివరణ ఇవ్వాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో ఆలయ ప్రస్తుత ధర్మకర్త లింగారెడ్డి, మంగుంట హిమాచలపతిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఆరిమాకులపల్లి సుబ్రమణ్యం నాయుడు, స్థానిక సర్పంచ్ దామోదర్‌నాయుడు, రఘునాథ్‌నాయుడు, వివిపురం సిద్దయ్యశెట్టి, రఘునాథరెడ్డి, తయ్యూరు వెకంటరమణ, శంకర్‌రెడ్డి, 18 గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత...ఇద్దరు నిందితులు అరెస్టు

చిత్తూరు, ఆగస్టు 11 ప్రభాతవార్త: చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఇన్స్‌పెక్టర్ జయరామయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ సుమన్, సిబ్బంది చిత్తూరు-బండపల్లి మార్గంలో 3 కేజీల గంజాయిని పట్టుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఇన్స్‌పెక్టర్ జయరామయ్య వెల్లడించిన వివరాల మేరకు అక్రమ గంజాయి రవాణాపై కచ్చితమైన సమాచారం అందడంతో తనతో పాటు ఎస్ఐ సుమన్, సిబ్బంది చిత్తూరు-బండపల్లి రహదారిపై కాపు కాశామన్నారు. ఈ క్రమంలో ఇద్దరు మోటర్ సైకిల్‌పై వస్తూ తమను చూసి పారిపోవడానికి ప్రయత్నించడంతో వారిని వెంబడించి పోలీసులు పట్టుకున్నారన్నారు. వారిని తనిఖీ చేస్తే రెండు గంజాయి బ్యాగులు లభ్యం అయ్యాయన్నారు. ఒక బ్యాగులో 2 కేజీల గంజాయి, మరొక బ్యాగులో ఒక కేజీ గంజాయి లభించిందన్నారు. వీరు రూ.10 వేలకు ఒక కేజీ గంజాయి కొనుగోలు చేసి ఒక కేజీ గంజాయిని చిన్న చిన్న పొట్లాలుగా కట్టి రూ.25 వేలకు విక్రయిస్తారన్నారు. అంటే 3 కేజీల గంజాయిని ఒక ప్రాంతంలో 30 వేలకు కొనుగోలు చేసి అదే గంజాయిని ఇక్కడ 75 వేల రూపాయలకు విక్రయిస్తారన్నారు. ఈ కేసుకు సంబంధించి చిత్తూరు మిట్టూరుకు చెందిన బి.మదన్(26)', బి.మనోజ్(23)లను అరెస్టు చేసి చిత్తూరు డిప్యూటీ తహసిల్దారు ధనంజయులు ఎదుట హాజరు పరచి ఆపై రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.

## వైభవంగా కావలి వారిపల్లెలో పశువుల పండుగ



పాకాల, ఆగస్టు 11 ప్రభాతవార్త : పాకాల మండలం కావలివారిపల్లెలో పశువుల పందేలుగా పేరు గాంచిన జల్లికట్టును పల్లెవాసులు కోలాహంగా జరుపుకున్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిధిగా చంద్రగిరి నియోజకవర్గం చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు వినీల్ సాయి పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన వినీల్‌కి యువత బాణాసంచా పేల్చుతూ, మహిళలు మంగళ హారతులు పట్టి అపూర్వ స్వాగతం పలికారు. వినీల్ మాట్లాడుతూ జల్లికట్టు వలన మరుగున పడిపోతున్న గ్రామీణ పండుగ సంబరాలను భావితరాలకు అందించవచ్చని తెలియజేశారు. జల్లికట్టునఉ తిలకించడానికి, పశువులను నిలువరించి, బహుమతులను చేజిక్కించుకోవడానికి పలు ప్రాంతాల నుంచి వేలాదిగా యువత తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, యువత, అభిమానులు పాల్గొన్నారు.

## వైభవంగా ద్రౌపతీదేవి అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం

**-సింహవాహనంపై గ్రామవీధుల్లో స్వామి,అమ్మవారు దర్శనం**



నారాయణవనం, ఆగస్టు 11 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని నారాయణవనంలో వెలసిన ద్రౌపతీదేవి సమేత ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అగ్ని గుండప్రవేశ కార్యక్రమం జరిగింది. చేతికి కంకణం ధరించిన భక్తులు నారాయణవనంకు చుట్టు వున్నట్టు వంటి ఏడుబావుల్లో పవిత్రస్నానాలను చేసిన తర్వాత అగ్నిగుండం ప్రవేశం చేశారు. సుమారు 1000మంది వరకు భక్తులు మొక్కుబడితో చేతికి కంకణం ధరించి అగ్నిగుండప్రవేశం చేయడానికి ముందుకు రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. రాత్రి 8గంటలకు అమ్మవారిని, స్వామివారిని సింహవాహనంపై అధిరోహించి పురవీధుల్లో మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భాణసంచావేడుకల నడుమ ఊరేగించారు. ఆలయం ఎదుట వేలాదిమంది భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. అలాగే మొక్కుబడి కలిగిన భక్తులు ఆలయం ఎదుట జంతుబలి సమర్పించారు.

## అనుభవం,అవగాహనతో...భక్తులకు సేవలు

**-నేరాలనియంత్రణకు చర్యలు -తిరుమల నూతన డిఎస్పీ విజయశేఖర్**



తిరుమల, ఆగస్ట్ 11ప్రభాతవార్తప్రతినిధి: పుణ్యక్షేత్రం తిరుమలలో గతంలో పనిచేసిన అనుభవం, యాత్రికులు, భక్తుల పట్ల పోలీసులు మర్యాదపూర్వకంగా వ్యవహరించడం లో అవగాహన ఉండటంతో తిరుమల డిఎస్పీగా సమర్థవంతంగా సేవలందిస్తానని నూతన డిఎస్పీ కె.విజయశేఖర్ ఉద్ఘాటించారు. ఇక్కడకు వస్తున్న భక్తులకు అవసరమైన సేవల ందించడంతోబాటు వారికి సమాచారం ఇవ్వడంలో పోలీసులు ముందుంటారన్నారు. రోడ్డుపై విధులు నిర్వహించే పోలీసులు భక్తులకు కనిపిస్తుంటారని, వారికి అవసరమైన సమాచారం తెలియజేసేలా సూచనలు చేస్తానన్నారు. భక్తుల వస్తువులకు భద్రత కల్పించి , నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటానన్నారు. యాత్రికులు కూడా తమతమ వస్తువులు, చిన్నపిల్లల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. నిరంతరం గస్తీతో బాటు యాత్రికులను అప్రమత్తం చేసేలా క్రిందిస్థాయి పోలీసుల్లో మార్పుతీసుకువస్తానన్నారు. గతంలో ఎస్ఐగా, సిఐగా పనిచేసిన అనుభవంతో అటు టిటిడితో ఇటు యాత్రికులతో సంయమనంగా సమన్వయంతో పనిచేస్తానన్నారు. తిరుమల నూతన డిఎస్పీగా ఆదివారం విజయశేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను తిరుమల 1టౌన్ సిఐ విజయకుమార్, 2టౌన్ సిఐ సత్యనారాయణ, పోలీసులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిఎస్పీ విజయశేఖర్ తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు ఆలయంలోనికి చేరుకుని దేవదేవుని దర్శనం చేసుకుని స్వామివారి ఆశీస్సులందుకున్నారు.

## సంస్కృత వర్సిటీలో సంస్కృత వారోత్సవ మహోత్సవాలు ప్రారంభం



తిరుపతి విద్య, ఆగస్టు 11, ప్రభాతవార్త జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం తిరుపతిలో ఆదివారం నుండి 19వ తేది వరకు సంస్కృత సప్తాహ మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ప్రతి సంవత్సరం కూడా శ్రామణమాసంలో ఈ యొక్క సంస్కృత సప్తహ కార్యక్రమాన్ని ప్రారంభించి పూర్ణిమ తిధితో సమాప్తం చేయడం జరిగింది. ఈ సంస్కృత సప్తహ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కర్ణాటక సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ. ఎస్. అహల్య మాట్లాడుతూ సంస్కృత భాష భారతీయ సంపదని, ఆ సంస్కృత భాష ద్వారా ఎన్నో గ్రంధాలు రచించడం జరిగిందని, ఆ జ్ఞానాన్ని భావిభారత పౌరులు అధ్యయనం చేస్తూ తెలుసుకోవాలని వివరించారు. అనంతరం విశిష్టాతిథి సీడాక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.ఎస్.డి సుదర్శన్ మాట్లాడుతూ సంస్కృతంలో ఉన్నటువంటి జ్ఞానాన్ని టెక్నాలజీ మాధ్యమంలో ఆధునిక భారతానికి అందించాలనే లక్ష్యంతో సీడాక్, ఎన్ఎస్‌యు త్వరలో పరస్పర అవగాహన ఒప్పందం చేసుకొని విభిన్నమైనటువంటి ప్రాజెక్టులు ప్రారంభిస్తుందని తెలియజేశారు. విశ్వవిద్యాలయం ప్రొ. కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృత భాష వైభవాన్ని విద్యార్థులకు, సమాజానికి తెలియజేయాలనేటువంటి సత్సంకల్పంతో ప్రతి సంవత్సరం కూడా ఈ సంస్కృత సప్తాహ మహోత్సవాన్ని విశ్వవిద్యాలయంలో చాలా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ. రమాశ్రీ, అకాడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్ల, వాగ్వర్ధినీ పరిషత్ కోఆర్డినేటర్ డా. సి. నాగరాజు, డా. ఉదయన హెగ్డే, విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేసారు.

## అంకాళమ్మకు బంగారు ముక్కుపుడక విరాళం



శ్రీకాళహస్తి, ఆగస్టు 11 ప్రభాతవార్త : పట్టణంలోని పివిరోడ్డు వద్ద వెలసిన అంకాళమ్మ అమ్మవారికి మరాఠీపాళెం వాస్తవ్యులు నరసింహారావు జాతర సందర్భంగా బంగారు ముక్కుపుడక సమర్పించారు. ఈసందర్భంగా దాతకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు. అమ్మవారి అలంకరణ ఇట్టే ఆకట్టుకుంది. ఉదయం నుంచి మహిళా భక్తులు అమ్మవారికి పొంగళ్ళుపెట్టి మొక్కులుతీర్చుకున్నారు. అనంతరం ఉత్సవమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో యశ్వంత్‌రావు పవార్, రాజశేఖర్‌రావు, బాలాజీరావుల ఆధ్వర్యంలో జాతరను వైభవంగా నిర్వహించారు.

## వేడుకగా ముగిసిన శ్రీకృష్ణదేవరాయుల నృత్యకళోత్సవాలు



తిరుపతిటౌన్, ఆగస్ట్ 11ప్రభాతవార్త: : నేటి తరానికి పాతనాటి కళలను పరిచయంచేసేలా, కళాకారుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేలా రాయలసీమ రంగస్థలి కళాసంస్థ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని నగరంలోని వక్తలు డాక్టర్ పిసి రాయలు, చిన్నంగారిరమణ, ఊకా విజయకుమార్, సుబ్రమణ్యంయాదవ్ అన్నారు. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రాయలసీమ రంగస్థలి శ్రీకృష్ణదేవరాయుల నృత్యకళోత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈముగింపులో శాస్త్రీయనృత్యంలో కుషాలిని బృందం (విశాఖపట్నం), జతీష్‌నృత్యాలయ (తిరుపతి), నాట్యాల య గ్రూప్ (హైదరాబాద్), జానపదనృత్యంలో శ్రీకాళహస్తి ఆశాగ్రూప్, లహరిడ్యాన్స్ అకాడమీ, గీతాహర్షితా గ్రూప్, శాస్త్రీయనృత్యంసోలోలా జి.అనన్య (గుంటూరు), హర్షిక(హనుమకొండ), లక్ష్మీస్నిగ్ధ (వరంగల్), జానపదం సోలోలో శ్రీవైష్ణవి (అనంతపురం), జి.షర్విత(గుంటూరు); దేక్ష్య(గూడూరు),. జూనియర్స్‌లో వి.హన్విత(వరంగల్), లోహితరెడ్డి(శ్రీకాలహస్తి), ఎన్.హాసినిప్రియ (తిరుపతి) బహుమతులు అందుకున్నారు.

## భాషోపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి విద్య, ఆగస్టు 11 ప్రభాతవార్త : రాష్ట్రంలో డిఈవో పూల్‌లో ఉండే సుమారు 1000 మంది, భాషా పండితులకు సత్వరమే పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షులు దొడ్డ ఉమామహేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతిలోని టిపిపిఎం ఉన్నత పాటశాలలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ ఉమ్మడి చిత్తూరు జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు దొడ్డ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ భాషా పండిత వ్యవస్థ రద్దు అయినప్పటికీ మిగులు భాషా పండితులు ఇతర క్యాడర్ పోస్టులలో పనిచేస్తూ వేతనం పొందుతున్నారని, ఎప్పుడు బదిలీలు జరిగిన వారికి స్థాన చలనం కల్పించడంతో వారు తీవ్ర మానసిక ఆవేదనకు లోనవుతున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించకుండా పని సర్దుబాటుకు పూనుకోవడం సమజసం కాదన్నారు. జీవో 117 ప్రకారం కాకుండా జీవో నెంబర్ 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలన్నారు. జీవో 53 ప్రకారం స్టాఫ్ ప్యాటర్న్ అనుసరించి 241 దాటితే తెలుగుకు లాగానే హిందీకి సైతం రెండవ పోస్టును కేటాయించాలన్నారు. 9,10 తరగతులకు సంబంధించి హిందీ సబ్జెక్టులో సిలబస్ చాలా కఠినంగా ఉందని, పాఠ్యాంశాల నిడివిని తగ్గించాలని సిలబస్‌లో మార్పులు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌టిఏ రాష్ట్ర కార్యదర్శి ఎస్. ప్రకాష్, గౌరవ సలహాదారులు సి. ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి విశ్వనాథం, జిల్లా ఉపాధ్యక్షులు సహదేవుడు, నేతలు శ్రీరాములు, పట్టాభిరామయ్య, టి. శ్రీనివాసులు, డి. రామచంద్రయ్య, బి. గణపతి, గంగులయ్య, సుందరయ్య, ఎల్. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి



తడ, ఆగస్టు 11 ప్రభాతవార్త : తడ మండలం కొండూరు పంచాయతీ పరిధిలోని పులివేంద్ర వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మరొకరు తీవ్ర గాయాలు పాలయ్యారు. పోలీసుల కథనం మేరకు, శనివారం రాత్రి స్థానిక శ్రీసిటీలోని ఒక పరిశ్రమలో పనిచేస్తున్న తడ మండలం భీములవారిపాలెంకు చెందిన పి.మస్తాన్ (25), పెరియవట్టు కుప్పానికి చెందిన ఎం.సాదిక్‌లు సూళ్లూరుపేటలో ఒక శుభ కార్యానికి వెళ్లి వస్తుండగా జాతీయ రహదారిపై వేగంగా వెళుతున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మోటార్‌బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో హుటాహుటిన సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే వీరిలో మస్తాన్ మృతిచెందినట్లు ఆదివారం ఆయన భార్య షేక్ దౌలత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాదిక్‌ను ప్రథమ చికిత్స అనంతరం చెన్నై స్టాన్లీ ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించినట్లు కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు. పులివేంద్ర గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్‌ను రమేష్‌గా గుర్తించామన్నారు. తడ మండలం రామాపురం జాతీయరహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో అక్కడ సచివాలయంలో పనిచేసే ఆంబాకం మునస్వామి (45) మృతి చెందిన పోలీసులు తెలిపారు. రోడ్డు దాటుతున్నడగా మోటారు బైక ఢీ కొనడంతో ప్రమాదం చోటుచేసుకున్నది.

## పంద్రాగస్టున ప్రారంభానికి సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్




కుప్పం, ఆగస్టు 11 ప్రభాతవార్త : పేద ప్రజల ఆకలి తీర్చే అన్న క్యా ంటీన్ ప్రారంభానికి అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. స్థానిక బస్టాండు పార్కు వెనుక భాగంలో ఆగస్టు 15న అన్న క్యా ంటీన్‌ను ప్రారంభించనున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అన్న క్యాంటీన్ నిర్వహణకోసం భవన నిర్మాణం ప్రారంభించి ముప్పావు వంతు పనులు పూర్తి చేశారు. తదనంతరం వైకాపా ప్రభుత్వం రావడం అన్న క్యాంటీన్లను రద్దు చేయడం జరిగింది. దీంతో ఈ భవనం అలాగే అసంపూర్తిగా ఉండేది. అయితే ఎన్నికల సమయంలో వైకాపా నేతలు అసంపూర్తి భవనానికి రంగువేయించి రాజన్న క్యా ంటీన్ పేరిట అప్పట్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డిచే హడావుడిగా ప్రారంభించినా ఒక్కరోజు కూడా అక్కడ క్యాంటీన్ నిర్వహించలేదు. మరలా తెదేపా ప్రభుత్వం అధికారంలో రావడం అన్న క్యాంటీన్లను ఆగస్టు 15న 100 ప్రాంతాల్లో ప్రారంభిస్తామని ప్రకటించింది. సిఎం చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలోని అన్న క్యాంటీన్ భవన పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం అన్న క్యా ంటీన్ భవనం సర్వాంగసుందరంగా రూపుదిద్దుకుంది. మెప్మా ద్వారా తాగునీటి వసతికై ట్యాంకు ఏర్పాటుచేశారు.

## మీ కోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జులై 28 ప్రభాతవార్త : ఆగష్టు 11వ తేది సోమవారం తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో మీ కోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నట్లు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇకపై ప్రతి సోమవారం మీ కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ తెలిపారు.

## పద్మావతి అమ్మవారి సేవలో మేయర్



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 11 ప్రభాతవార్త : తిరుచానూరు పద్మావతి అమ్మవారి సేవలో నగర మేయర్ డాక్టర్ శిరీష దంపతులు ఆదివారం ఉదయం పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష దంపతులు వైష్ణవి హాస్పిటల్ అధినేత డాక్టర్ మునిశేఖర్ పెళ్లి రోజు సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి అధికారులు, అర్చకులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాటు చేశారు.

## అక్రమంగా తరలిపోతున్న వెదురు

**మామూళ్లకు అలవాటుపడిన అధికారులు**



సోమల, ఆగస్టు 11 ప్రభాతవార్త : అడవులు మానవాళికి ఎన్నో విధాల మేలు చేస్తూ మనకు ఎన్నో పండ్లు ఔషధాలను అందిస్తూ పచ్చదనం పరచుకున్న అడవుల వల్ల వర్షాలు కూడా పడుతూ ప్రకృతికి సహకరిస్తూ ఉంటాయి. అలాంటి అడవులను కొందరు తమ స్వార్థ ధన దాహంతో అటవీ సంపదను కొల్లగొడుతూ జేబులు నింపుకుంటూ అడవులను పచ్చదనాన్ని హరిస్తున్నారు. మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లి పంచాయితీ పరిధిలో అడవులు విస్తారంగా ఉన్నాయి. అడవుల్లో ఎన్నో రకాలైన వృక్షాలు, మొక్కలు ఏపుగా పెరిగి పచ్చదనాన్ని సంతరించుకొని ఉన్నాయి. అయితే పంచాయితీ పరిధిలోని కొందరి ధన దాహం కారణంగా వెదురు పొదలను నరికి వెదురు కట్టెలను మోపులుగా చేసి అక్రమంగా తరలిస్తూ మండలాన్ని దాటిస్తున్నారు. ఇందుకోసం నిరుపేదలైన కూలీలను పావులుగా వాడుకుని వారికి ఒక్క కట్టెకు 15 ఇస్తున్నారు. ముఖ్యంగా కూలీలుగా యానాదులను వాడుకుంటూ వారికి డబ్బు ఆశ చూపి తమ అక్రమ ఊబిలోకి లాగుతున్నారు. రోజుకు రెండు వేల నుండి 5 వేల వెదురు కట్టెలు సిద్ధం చేసి వాటిని ట్రాక్టర్లు లారీలలో తరలిస్తున్నట్లు సమాచారం. ఇంత తతంగం అటవీ శాఖ సిబ్బందికి తెలిసినా అక్రమార్కులు ఇచ్చే అక్రమ సంపాదనకు అలవాటు పడి ఏమీ తెలియనట్లుగా వ్యవహరిస్తూ వెదురు పుష్పలకు సహకరిస్తున్నారన్న వార్తలు ఈ ప్రాంతంలో గుప్పుమంటున్నాయి. గత ఏడాది కాలంగా ఈ వెదురు పూర్తిగా అంతరించిపోయే అవకాశం లేకపోలేదు.